నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 31 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM

వరి పంటలో మేస్తున్న పశువులు

కండ్ల ముందే పంటలు ఎండిపోతుండడంతో రైతన్నలు ఏడుస్తున్నారు. సాగు చేసిన వరి పంటను కాపాడుకునేందుకు నీరు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రస్తుతం పాట్టదశలో ఉన్న పంటను రక్షించుకునేందుకు కొందరు రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పాక్లెయినర్ సాయంతో బావులు తీసి మరీ కాపాడుకుంటున్నారు. వైరా మండలంలో అన్నదాతల పరిస్థితి దయనీయంగా ఉంది. సాగర్ జలాలు విడుదల చేయకపోవడంతో వైరా రిజర్వాయర్ నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. మండలంలో 1,302 ఎకరాల్లో వరి, 1,053 ఎకరాల్లో మొక్కజొన్న, 175 ఎకరాల్లో పెసలు, 75 ఎకరాల్లో మినుములు సాగు చేస్తున్నారు. చాలాచోట్ల భూములు నెర్రెలుబారడంతో పంటను పశువులకు మేపుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

- వైరారూరల్, మార్చి 30

పది అడుగులకు చేరిన వైరా రిజర్వాయర్ నీటిమట్టం

అన్నదాతల ఆక్రందన

- సాగునీరు లేక ఎండిపోతున్న పంటలు
- నెర్రెలు వారుతున్న పొలాలు
- పంట చేలల్లో పశువులను మేపుతున్న రైతులు
- పూర్తిగా అడుగంటిన వైరా నది
- వైరా మండలంలో ఎండిన వాగులు, వంకలు

వైరా మండలంలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. వైరా రిజర్వాయర్ నీటిమట్టం 18 అడుగులకు గాను ప్రస్తుతం 10 అడుగులకు చేరుకుంది. వైరా నదీ పరీవాహక ప్రాంతాలు పూర్తిగా ఎండిపోయాయి. అయితే పొట్టదశలో ఉన్న వరిని కాపాడుకునేందుకు స్నానాల లక్ష్మీపురం, గన్నవరం తదితర గ్రామాల రైతులు నదిలో గుంతలను తీసి విద్యుత్ మోటర్ల సాయంతో పంటలకు సాగునీరు అందిస్తున్నారు. దాచాపురంలో రైతులు రూ.35 వేలు ఖర్చు చేసి మరీ పొక్లెయిన్ సాయంతో బావులను తవ్విస్తున్నారు. గరికపాడు, ముసలిమడుగు గ్రామాల్లో పంటలు ఎండిపోవడంతో పశువులను మేపుతున్నారు. బావులు, బోర్లలో నీరు లేకపోవడంతో చేసేదేమీ లేక వరి పంటలను వదిలేస్తున్నారు. వేల రూపాయలు పెట్టుబడిగా పెట్టి పంట చేతికొచ్చే దశలో ఇలా పశువుల పాలుకావడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూడకుండా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

నీళ్లు లేక నెర్రెలు వారుతున్న సాగు భూములు

పశువులను మేపుతున్నా..

ఆరు ఎకరాల్లో వరి వేశాను. సుమారు రూ.లక్ష వరకు ఖర్చు వచ్చింది. చేతికందొచ్చిన పంట నీరులేక ఎండిపోవడంతో ఏమీ చేయలేని స్థితిలో పశువులను మేపుతున్నాం. ప్రభుత్వం ఆదుకొని రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి.

–కొలివి శేషగిరి, రైతు, ముసలిమడుగు

బావుల్లో నీరు అడుగంటాయి..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది బావుల్లో నీరు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయి. సరైన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, చెరువులు, కాల్వల ద్వారా నీరు అందకపోవడంతో వరి రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే చాలా తీవ్రంగా నష్టపోతారు. అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

–కోటా యేసు, రైతు, గరికపాడు

చేతికొచ్చిన పంట ఎండిపోయింది..

వైరా మండలంలో చాలామంది రైతులు వరిపై ఆధారపడి ఉన్నారు. వైరా రిజర్వాయర్ నుంచి గన్నవరం ఏటి ద్వారా పంటలకు సాగునీరు అందిస్తున్నాం. ఈ ఏడాది వైరా నది పూర్తిగా ఎండిపోవడంతో పొట్ట దశకు వచ్చిన పంట ఎండిపోయింది. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాం. వరికంకి దశకు చేరుకునే సమయంలో నీరు అందడం లేదు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలి.

– ముక్కెర పుల్లారెడ్డి, రైతు, దాచాపురం

డోర్నకల్ - గద్వాల్ రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చండి

ఎంపీ వద్దిరాజుకు బాధిత రైతుల వినతి

బాధిత రైతులతో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, మార్చి 30 : పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతుల విలువైన వ్యవసాయ భూములకు నష్టం చేకూర్చే డోర్నకల్– గద్వాల్ రైల్వే అలైన్‌మెంట్ మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధిత రైతులు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఖమ్మం నగరంలోని ఎంపీ నివాసంలో ఆయన్ని కలిసి సమస్యను వివరించారు. పాపటపల్లి నుంచి జాన్‌పాడు వరకు నిర్మించ తలపెట్టిన ఈ అలైన్‌మెంట్ రద్దుపరిచి, ప్రత్యామ్నాయంగా వయా మోతే మీదుగా జాన్‌పాడుకు మార్చాలని కోరారు. ఇప్పటికే మోటమర్రి–జాన్‌పాడు డబ్లింగ్‌లైన్ మంజూరైనందున, దానిని ఉపయోగించుకుని ప్రతిపాదిత జాన్‌పాడు– పాపటపల్లి లైన్ ప్రతిపాదన రద్దుపర్చేలా సహకరించాలని రైతులు కోరారు. బాధిత రైతులంతా ఎవరికీ నష్టం కలగని రీతిలో ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తూ సమగ్ర నివేదికతో వస్తే కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో బాధిత రైతు ప్రతినిధులు వల్లూరి పట్టాభిరెడ్డి, సయ్యద్ సాధిక్ అలీ, తోట రామారావు, ముత్యం ఉప్పలరావు, గుర్రం రాము, పండరి, రాజు, నల్లపు నేని రమణయ్య ఉన్నారు.

నేడు పాలేరులో బీఆర్ఎస్ బృందం పర్యటన

ఎండిన పంటలు, తాగునీటి కష్టాల పరిశీలన

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం, మార్చి 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ఆదివారం పాలేరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎండిన పంటలు, తాగునీటి ఇబ్బందులను జిల్లా పార్టీ ప్రతినిధుల బృందం పరిశీలించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. యాసంగి సాగు రైతులు ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పంటలు ఎండిపోయిన పరిస్థితి ఎప్పుడూ కనిపించలేదని, తాగునీరు మారుమూల గ్రామాలకు సైతం అందేదన్నారు. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రతినిధి బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన తర్వాత నేలకొండపల్లి మండలంలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించనున్నట్లు పేర్కొన్నారు. బృందంలో ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

మౌలిక వసతులు మెరుగుపరచండి

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

గాంధీనగర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

చింతకాని, మార్చి 30 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు మెరుగుపరచాలని, ఆయా కేంద్రాల్లో చేపట్టిన పనులు ఏప్రిల్ రెండో వారంలోపు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. గాంధీనగర్, జగన్నాథపురం, మత్కేపల్లి, తిర్లాపురం, నరసింహాపురం తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఎంపిక చేసిన పనులు, మరమ్మతులు, మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు, ర్యాంపులు తదితర మౌలిక వసతుల కల్పన యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వస్తువులు కనిపించకపోవడంతో కలెక్టర్ పంచాయతీ అధికారులను మందలించారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేశ్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో రామయ్య, ఎంపీవో రవీంద్రప్రసాద్, కార్యదర్శులు నాగరాజు, వినోద్, బాబూరావు, రాధిక, ధనలక్ష్మి, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పద్ధతులతోనే దిగుబడులు

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్

అశ్వారావుపేటలో పుచ్చ సాగును పరిశీలిస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేట, మార్చి 30 : రైతులు సాగులో నూతన పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధించాలని, ఆ దిశగా రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్‌కుమార్ అన్నారు. ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన బీఎస్సీ(బోటనీ) విద్యార్థులు శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ కళాశాలను సందర్శించారు. కళాశాలలో సాగవుతున్న పలు పంటలను క్షేత్రస్థాయిలో విద్యార్థులు అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధిలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల పాత్ర అత్యంత కీలకమని, రైతు కష్టం లేనిదే ప్రజలకు సరిపడా ఆహార ఉత్పత్తులు అందుబాటులో ఉండవని అన్నారు. అనంతరం బొప్పాయి, చెరుకు, పుచ్చ, వంగ సాగు పద్ధతుల గురించి శాస్త్రవేత్త డాక్టర్ రాంప్రసాద్ విద్యార్థులకు వివరించారు. తేనెటీగల పెంపకం, వాటి పద్ధతులు, ఆదాయంపై డాక్టర్ లక్ష్మణ్ వివరించారు. వానపాముల తయారీ, వాటి ప్రయోజనాల గురించి డాక్టర్ పావని తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ వ్యవసాయం, పద్ధతులు, రైతుల పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, శ్రీనివాస్, దుర్గాభవాని, ఏఈఎల్‌పీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఖమ్మంలో క్రైస్తవుల భారీ ర్యాలీ

ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఖమ్మం, మార్చి 30 : ఈస్టర్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ పలు సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రన్ ఫర్ జీసస్ క్రైస్తవుల ర్యాలీ ఉదయం ఏడు గంటలకు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ప్రారంభమై కొత్త బస్టాండ్, బైపాస్ రోడ్డు, డీఆర్‌డీఏ ఎదుట నుంచి బస్ డిపో మీదుగా పెవిలియన్ గ్రౌండ్ వరకు నిర్వహించారు. జయహో హోసన్న, యేసు నిజముగా లేచియున్నాడు, క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియైయున్నాడు, ఇదిగో లోక పాపములను మోసుకొనిపోవు దేవుని గొర్రెపిల్ల, దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను, యేసు చెప్పెను నేనే సత్యమును.. నేనే జీవము.. నేనే మార్గము, మనమింకను పాపులమైయుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను అని నినాదాలు చేసుకుంటూ సుమారు 2000 మందితో ర్యాలీ నిర్వహించారు. కన్వీనర్ చల్లగుండ్ల రమేశ్‌బాబు అధ్యక్షత వహించగా బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంపాల కృష్ణమోహన్, సీఎస్ఐ పీస్ కమిటీ చైర్మన్ పల్లా రాజశేఖర్, క్రైస్తవ పెద్దలు ఏర్పుల ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మహాసేన జిల్లా అధ్యక్షుడు మందా సంజీవరావు, ఐక్యవేదిక అధ్యక్షుడు తిమోతి, బిషప్ జాన్ కాంతారావు, వేముల సత్యం, జాకోబ్ జాన్, ఎన్.బాలస్వామి, కే బాబూరావు, అభిషేక్, రవికిరణ్, బి.పాల్, జగన్, ఐజెక్, సంజీవరావు, పాల్, ఆదాం పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

వీసీలో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 30 (నమస్తే తెలంగాణ)/ఖమ్మం : ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి.. ఇతర ఉన్నతాధికారులతో కలిసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యంపై ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీసీల్లో కలెక్టరేట్‌ల నుంచి ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, వేణుగోపాల్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ముగిసిన వెంటనే సదరు ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించే సమయంలో అవసరమైన మేర కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఫారం–12 అందజేసి ఉద్యోగి ఆప్షన్ తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2, 3 తేదీల్లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని ఏఆర్‌వోలను ఆదేశించారు. జిల్లాలో ప్రతి శిక్షణ కేంద్రానికి ఇంఛార్జిగా జిల్లా అధికారులను నియమించామన్నారు. వీసీలో శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో వినోద్, ఆర్డీవో గణేశ్, ఎస్డీసీ రాజేశ్వరి, డీఈవో సోమశేఖర శర్మ, కలెక్టరేట్ ఏవో అరుణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మదన్ గోపాల్, రాంబాబు, భద్రాద్రి జిల్లా ఎలక్షన్ సూపరింటెండెంట్లు దారా ప్రసాద్, రంగ ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

పరీక్షలు ముగియడంతో ఆనందంతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్/కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 30 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఖమ్మంలో ఒక్క ఇన్విజిలేటర్‌ను, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను విధుల నుంచి తప్పించడం మినహా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. జిల్లా అబ్జర్వర్ పి.మదన్‌మోహన్‌కు గతంలో జిల్లాలో మూడేళ్లుగా డీఈవోగా పనిచేసిన అనుభవం ఉండడంతో ఉదయం, సాయంత్రం పరీక్షల సరళిపై పర్యవేక్షణ చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేశారు. ఖమ్మం డీఈవో సోమశేఖర శర్మ, అబ్జర్వర్లు పరీక్ష ముగిసిన తర్వాత కలెక్టర్ వీపీ గౌతమ్‌కు ప్రతి రోజు రిపోర్ట్ ఇవ్వడంతోపాటు కలెక్టర్ ప్రతిరోజు కేంద్రాలను సందర్శించడం, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేశారు. భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, డీఈవో వెంకటేశ్వరచారి పలు కేంద్రాలను సందర్శించి పరీక్షల తీరును పరిశీలించారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేంద్రాల వద్ద కేరింతలు కొట్టారు. వసతి గృహాల నుంచి విద్యార్థులు ఇళ్లకు బయలుదేరారు.

పోయిన ఫోన్లను తిరిగి రప్పించారు..!

ఫోన్ పోయిందని 1,674 ఫిర్యాదులు..

964 ఫోన్లు తిరిగి స్వాధీనం

బాధితులకు అందజేసిన ఎస్పీ రోహిత్ రాజు

రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అప్పగిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, మార్చి 30: మీ ఫోన్ పోయిందా..? అందులోని విలువైన/రహస్య సమాచారం దుర్వినియోగమవుతుందని భయపడుతున్నారా..? చింతించకండి. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి. ఆధునిక సాంకేతికత ఆధారంగా మీ ఫోన్‌ను వారు తిరిగి రప్పించేందుకు అవకాశాలున్నాయి.

పోయినవి 1,674.. తిరిగొచ్చినవి 964

తమ ఫోన్ పోయిందంటూ/చోరీ జరిగిందంటూ గడిచిన ఏడాది కాలంలో జిల్లావ్యాప్తంగా పోలీసులకు 1,674 ఫిర్యాదులు అందాయి. ఇందులో 964 ఫిర్యాదులను వారు పరిష్కరించారు. ఇందులో, ఇప్పటివరకూ 483 ఫోన్లను వాటి స్వంతదారులకు అప్పగించారు. వీటిలో కొన్నింటిని ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు పోగొట్టుకున్న ఫోన్లను అధునాతన సాంకేతిక పరిజ్ఞానం 'సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా స్వాధీనపర్చుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 1,674 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో 964 ఫోన్లను స్వాధీనపర్చుకున్నట్లు చెప్పారు. వీటిలో ఇప్పటి వరకు 483 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించామన్నారు. కొత్తగూడెం త్రీ టౌన్, మణుగూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్కువ ఫోన్లను స్వాధీనపర్చుకుని, బాధితులకు అప్పగించినట్లు చెప్పారు. ఇందుకు కృషి చేసిన కొత్తగూడెం త్రీ టౌన్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మడిపెల్లి నాగరాజు, ఐటీ సెల్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రెడ్డి, పీఆర్‌వో దాములూరి శ్రీనివాస్, ఐటీ సెల్ సిబ్బంది విజయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.